

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 ఫిబ్రవరి, 2022 సంచిక : 9

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

చిరునామా :-
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
శాశ్వత ధర్మగోప్త .......... 6
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 9
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 11
సాయిభక్త దాసగణు .......... 14
గురుదేవుల జన్మదినం .......... 17
లేఖావాణి .......... 18
చేటును తెచ్చే చెప్పుడు .......... 19
దయాహృదయపు దీపకాంతి .......... 23
ధీరవాణి .......... 25
స్వామీ వివేకానందుని సూక్తులు .......... 27
ప్రాతఃస్మరణీయుడు సర్దార్ .......... 28
భావనే భగవంతుడు .......... 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



శ్రీ సాయినాథ భక్తులందరికీ ప్రణామశతాలు. మహాశివరాత్రి పర్వ దినం యీ నెలలోనే జరుపుకొంటున్నాం. పరమశివుని ప్రీత్యర్థం భజనలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, గంగాజల స్నానాలు-యింకా ఎన్నెన్నో పూజలు జరుగుతాయి. కీసరగుట్ట, అరవపల్లి, కోటప్పకొండ మొదలైన చోట్ల తీర్థాలు, జాతరలు సాగుతాయి. శ్రీశైలం, ఉమామహేశ్వరం, కాళహస్తి వంటి చోట్ల మహోత్సవాలు జరుగుతాయి. మ్రొక్కుబళ్ళున్న వారు ప్రభలు కట్టుకొని "అశ్శరభ శరభ!" అని ప్రమథగణాల వలెనే కేకలు పెడుతూ శివాలయాలకు వెడతారు. తమ పాడి పశువులను పశుపతి మందిరం (శివాలయం) చుట్టూ ప్రదక్షిణ చేయించుకొని రావటం రైతన్నలకు ఆచారం. ఆబాల గోపాలం ఉపవసించటం, రాత్రంతా జాగరణ చేయటం కూడా భారతీయుల సంప్రదాయం. ఈ ఉపవాసం, జాగరణ అనేవి కొంచెం లోతైన పదాలు కానీ, కాలగతిలో కొంత తేలికైపోయాయి.

ఉప అనగా సమీపంలో, వాసం అంటే నివసించటం. మనసా వాచా కర్మణా కూడా భగవత్సన్నిధానంలో నివసించటమే అసలైన ఉపవాసం. నిజంగా మనసు భగవంతునిపై నిలిచింది. వాక్కు భగవన్నామమే పలుకుతున్నది. కర్మణా భగవద్రూపమైన సృష్టి సేవే సాగుతున్నది. ఇక ఆకలి దప్పుల గూర్చి యోచించేదెవరు? యోచించే సమయమేది? అంచేత తీవ్రంగా ఉపవసించేవాడు తిండీ తిప్పలూ మానేసి తదేక ధ్యానంలో ఉండిపోయేవాడు. అతడిలోలోపల నడిచే ధ్యానం గురించి యితరులకేం తెలుస్తుంది? కేవలం ఆహారం తినటం లేదన్న విషయం మాత్రమే తెలుస్తుంది. కనుక-

ఉపవాసం ఉండటం అంటే ఏమీ తినకుండా ఉండటం అన్న అర్థం వ్యాప్తిలోకి వచ్చేసింది.

ఇక-జాగరణ. 'జాగృతి' అంటే మెలకువ. నిత్య జీవన విధానపు మాయలోబడి మన ఆత్మ చైతన్యం నిద్రపోతూ ఉండటం సహజం. లౌకికపు మెళకువలు పెరిగేకొద్దీ యీ నిద్ర అంటే సత్య పథాన్ని గూర్చిన స్పృహ, ఆలోచన లేకుండా ఉండటం అన్నది పెరిగిపోతూ ఉంటుంది. ఇదుగో యీ జాగరణ చేయవలసిన పర్వదినాలలో మనం అంతవరకూ ఆవరించి ఉన్న ఆధ్యాత్మిక జడత్వాన్ని ఒక్కసారిగా విదిలించుకొని, వదిలించుకొని చైతన్యస్ఫూర్తిని పొందటం జరగాలి. అందుకోసమని రాత్రంతా నామస్మరణ, భజన, సంకీర్తన, కథాగానం మొదలైన వాటితో భగవత్సాన్నిధ్యానుభూతిని పొందే ప్రయత్నం చెయ్యాలి. తత్ఫలితంగా బూజు కొంత వదలిపోవాలి. అదీ జాగరణంటే.

ఇక శివరాత్రి విశిష్టతను చూస్తే-పరమశివుడు వైరాగ్యమూర్తి. ఆయన లయకారుడు గనుక ఆయన నిలువెల్లా ఆ విరక్తీ, మృత్యురక్తీ కూడా కన్పిస్తాయి. శివుని ఆభరణాలు సర్పాలు. సర్పం మృత్యువుకూ, కోరికలకూ సంకేతం. శివుడు వాటిని అలవోకగా లొంగదీసుకొని తన మెడలో వేసుకున్నాడు, శివుడు శ్మశానవాసి అదీ మృత్యువును గుర్తుచేసి, మనకు జ్ఞాన బోధ చేసేది. శివుని చేత నుండేది కపాలం. ఒంటి మీదున్నది గజ చర్మం. (చచ్చిన ఏనుగు నుండి ఒలిచిన తోలు) అవి రెండు మృత్యువును జ్ఞప్తికి తెచ్చేవే. శివుని అంగరాగం వల్ల కాటిలోని బూడిద అది అటువంటిదే. ఈ వైరాగ్య చిహ్నాలన్నిటినీ ధరించి విటలాక్షుడైనాడాయన. ఆయన నుదుటి మూడవ కన్ను-జ్ఞాన నేత్రం విచ్చుకొని ఉన్నది. ఎప్పటికప్పుడు తానెవరో, తన జన్మలక్ష్యమేమిటో గుర్తు చేసుకోగల మహనీయుడు సర్వజ్ఞులే కదా మరి! అంచేత నిరాడంబరతనూ, నిర్లిప్తతను ప్రేమించే ప్రతి భక్తుడూ





పరమేశ్వరుని ప్రేమిస్తాడు, ధ్యానిస్తాడు.

ఇవీలా ఉంచితే - పరమేశ్వరునిలో సేవకులందరూ నేర్చుకోవలసిన నేర్చుకొని తీరవలసిన ఒక మహత్తర విశేషం ఉన్నది. క్షీరసాగర మథనం సాగుతున్నది. సురులూ, అసురులూ మందరగిరిని తెచ్చారు. వాసుకిని దానికి త్రాడుగా చుట్టారు. కవ్వం సిద్ధమైంది. పాలకడలిని త్రచ్చటం ప్రారంభించారు. గిరి భూమిని తాకినందువలన కలిగే ప్రమాదాన్ని అరికట్టడానికి శ్రీమన్నారాయణుడు కమఠమై (తాబేలై) గిరికీ, భువికీ మధ్య పవళించాడు. సముద్రంలో నుంచి వచ్చే అమృతభాండం కోసం పరమాసక్తులై చూస్తున్నారు, పర్యవేష్టించి ఉన్నవారంతా. హఠాత్తుగా సెగలు, పొగలు రేపుతూ చెలరేగింది హాలాహలం. ఆ విషాగ్ని కీలలు తాకి జీవజాలమంతా అల్లాడ సాగింది. దిక్కుతోచక కైలాసగిరికి పరుగులెత్తారు. హాలాహలాన్నీ అణచి తమను రక్షించమని శివుని చరణాలపై శరణువేడారు. అప్పుడు పరమేశ్వరుడు పలికిన పలుకులు, ఆయన కార్యాచరణ విధానం చూడండి. ఆయన అమ్మవారితో యిలా అన్నాడు.

"కంటే జగములదుఃఖము, వింటే జలజనిత విషము వేడిమి ప్రభువై
యుంటకు వార్తుల యాపదగెంటించుట ఫలము, దాన కీర్తి మృగాక్షీ।
ప్రాణేచ్ఛే వచ్చి చొచ్చిన ప్రాణుల రక్షింప వలయు ప్రభువుల కెల్లన్
ప్రాణులకిత్తురు సాధులు, ప్రాణంబులు
నిమిషభంగురములనిమగునా।

అసలు ఎవరైనా తాను ప్రభువై జగతి నేలుతున్నాడూ అంటే దాని ప్రధాన ఫలితం ఆర్తితో ఉన్నవారి కష్టాలు తీర్చడమే. ప్రాణులను రక్షించ వలసిన బాధ్యత ప్రభువులదే! పైగా ఈ ప్రాణాలు ఎలాగూ క్షణకాలంలో కరిగిపోయేవే గాని నిలిచేవి కావు. ఎవ్వడైనా ఒక్కసారే చస్తాడు గానీ పదిసార్లు చావడు. అందుచేత ఆ క్షణికమైన ప్రాణాలను ఆర్తుల కోసం

ధారపోసి శాశ్వతమైన అమృతకీర్తిని పొందాలి-ఇలా అంటూనే పరమేశ్వరుడు ఒక చక్కని సిద్ధాంతం వంటి ధర్మాన్ని స్థిరీకరించి చెప్పాడు.

"పరహితము సేయునెవ్వడు,

పరమహితుండగును భూత పంచకమునకున్

పరహితమె పరమ ధర్మము పరహితునకు నెదురు లేదు

పర్వేందుముఖీ"

'ఇతరులకు మేలు చేసినవాడు పంచభూతాలన్నిటికీ పంచభూతాత్మకుడైన భగవానునికి సేవ చేసిన వాడవుతాడు. పరునికి హితవు చేయడాన్ని మించిన సద్ధర్మం మరొకటి లేనేలేదు".

ఆ మాటలంటూనే శివుడు ఆ భయంకర హాలాహలం అంతటిని ఒక్క ముద్దగా చేసి మ్రింగివేసాడట. అయితే తన కడుపులోనున్న పదునాల్గు లోకాలకూ ఎట్టి ప్రమాదం కలుగరాదని ఆ విషాన్ని కంఠాననే నిలిపివేసి గరళకంఠుడైనాడట.

సేవకధర్మాన్ని పాటించదలచుకొన్న సాధకులందరికీ యీ పరమ శివుని పలుకులు, చర్యలు శిరోధార్యాలు. పరులకు మేలు చేయటం కోసం ఎంతటి కష్టాన్నైనా తమ మీద వేసుకొనేందుకు సిద్ధమవటం, అది తన కర్తవ్యంగా భావించి ఖచ్చితంగా పాటించటం. తనకు కలిగిన బాధలేవైనా వెలిగ్రక్కినపుడు ఇతరులకు నష్టం కలుగుతుందనుకొన్నప్పుడు అది కంఠాననే నిలుపుకొని తొణకకుండా ఉండగలగటం- యివి మనందరికీ కావలసిన ఉత్తమ లక్షణాలే గదా! శివ సాన్నిధ్యంలో రోజంతా ఉపవసించి, మనలోని కార్యదీక్షను, కరుణను, పరోపకార దక్షతను జాగృతం చేసుకొని, మనం కూడ మహేశ్వరులమంతగా మారేందుకై ప్రయత్నం ప్రారంభిద్దాం.





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

'మహాత్ములారా! మీ బాధ నాకు అర్థమైంది. ఇది తేలికగా పరిష్కరింపతగ్గ సమస్య కాదు. ఇక్కడ ఈనాడు జరిగిన ఈ వ్యవహారాన్ని ఇక్కడే మరచిపోండి. నరకుని ప్రమాదాన్ని తప్పించడానికి సమయం పడుతుంది. మీరు చేయవలసిందల్లా, మీ ఆడబిడ్డలకు, స్త్రీలకు ధైర్యమివ్వడం. వారిని రక్షించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తను వాళ్ళు నమ్మేట్లు అందజేయడం - 'సాక్షాత్తు పరమేశ్వరుడే వారిని రక్షించడానికి వస్తాడు, మీరు ఎదురుచూడండి, మీ శ్రద్ధాభక్తులకిది పరీక్ష' అని ప్రబోధించండి. మిగతా సంగతి మేము చూచుకుంటాము. మీరు మీ నిత్యానుష్ఠాన పరంపరను శ్రద్ధాసక్తులతో, భక్తి ప్రపత్తులతో నిర్వహించుకోండి. మీరు ధర్మనిష్ఠులవుతే, ధర్మమే మిమ్ములను కాపాడుతుంది. కొంతకాలం బాధలు తప్పవు. ధర్మహంత ఎంత బలవంతుడైనా నాశనం కాక తప్పదు' అని కృష్ణుడు ధైర్యమిచ్చాడు.

ఉపమన్యు మహర్షి "కృష్ణా! నేను కూడా రేపో మాపో బయలుదేరుతా! నీవెప్పుడు కబురు పంపితే అప్పుడు వస్తా. నీవీనాడు ఈ తాపసులకు, శ్రోత్రియులకు ఇచ్చిన అభయం నిజంగా లోకరక్షాకరమయ్యా' అని దీవించాడు.

ఆ రాత్రే శ్రీకృష్ణుడు ఉపమన్యుల వారిని కలుసుకున్నాడు. 'గురుదేవా! నిన్న తాపసులు చెప్పింది నేను గ్రహించాను. నరకుని రాజ్యం చొరరాని నరకమే. మనకు అక్కడ నివసించే పార్వతేయుల సహకారం అవసరం- కొందరైనా మనకు సహకరించాలి'.

'నిజమే! వారి ఇండ్లలోంచి కూడా స్త్రీలను కొందరిని అపహరించాడా

దుర్మార్గుడు. చిత్రవాహనుడు కొంత పరోక్షంగా సహాయం చేయవచ్చు. మణిపురం, ప్రాగ్జ్యోతిషాల మధ్య నాగులున్నారు. వారు నరకునికి వ్యతిరేకులు. పోగా చిత్రవాహన రాజ్యానికి దిగువన కొన్ని గారుడ స్థావరాలున్నాయి' త్రివిష్టపం నుంచి గరుడులు సహకరించవచ్చు'.

'మీరు విజ్ఞులైన ముగ్గురు నలుగురు శ్రోత్రియులను నాకప్పగించండి. మీరు మిగతా వారి సహాయంతో అక్కడి స్త్రీలలో ధైర్యసాధకమైన భగవద్భక్తిని అంకురింప చేయించండి.

'నిజమే నాయనా! పరమేశ్వరునికి తమ సర్వస్వాన్ని సమర్పించుకుంటే ఇహ భయమేమిటి?'

'నేను మీకు ఉద్ధవ, అక్రూరులను అప్పగిస్తాను. ఆ ఇద్దరూ పరమ భాగవతులు. నరకుని చెరనుండి ముక్తులైన వారి జీవనాలకు భక్తినే ఆలంబనంగా అందజేయవలసి వస్తుందేమో. ఆ స్త్రీలు పరిత్యక్తలు కారాదు గదా!'

'కృష్ణా! వాసుదేవా! నీకెంతటి ముందుచూపు!'

ప్రభాసతీర్థం నుండి ద్వారకకు వచ్చి ముందు పెద్దలందరినీ కలుసు కున్నాడు. అక్కడ ఉపమన్యు మహర్షి సాంగత్యంలో తాను గడిపిన కాలాన్ని గురించి వివరించాడు. తరువాత అసమక్షేత్రం నుండి వచ్చిన తామసులు, శ్రోత్రియులు పడుతున్న నరకయాతనలను గురించి తెలిపి, నరకునిపై దాడి చేసి అతని చెరలో అలమటిస్తున్న పదహారు వేలమంది స్త్రీలను విడిపించడానికి అనుమతి కోరాడు. గర్గాచార్యులప్పడే దేవకీ వసుదేవులు ఉంటున్న సౌధభాగంలోకి వచ్చారు.

'మహర్షీ! మళ్ళీ కృష్ణుడు ఎవరి మీదికో దాడిచేస్తాడట నిజమేనా?' దేవకి గర్గాచార్యులనడిగింది.

'అవునమ్మా! అతడు చేసే దాడి ఎవరి మీదనో కాదు. అధర్మం మీద, ఆకతాయితనం మీద'.

'ఇక అతనికి జీవితంలో శాంతి లేదా! ఎప్పుడూ అతనికే ఆపద వస్తుందో నని బాధపడుతుండడమేనా?'





'అమ్మా! దేవకీ! పుట్టిన రక్తపుగడ్డను ఆనాడే మమకారం వదులుకొని పరాయిచేతుల కప్పగించావే! ఆయనను కాపాడడం కోసం ఏడుసార్లు గర్భశోకం అనుభవించి కూడా, సాధు సజ్జనపోషణకు, దుష్టులకు శిక్షించ డానికి సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే నీ గర్భాన పుట్టాడనుకొని, ఆయనను అలా ఆరాధిస్తూ, భజిస్తూ గడుపుతున్నావే! ఇవాళ ఈ నిర్వేదం ఎలా వచ్చిందమ్మా' గర్గాచార్యుడు ఆమె బాధకు ద్రవించాడు.

'నరకుడు సాక్షాత్తు నరకాన్ని సృష్టించగల సమర్థుడని, మాయావి అని విన్నాను మహర్షీ. అదీ నా బెంగ'.

'దిగులుపడకమ్మా! మన అందరి దిగులు పోగొట్టడానికి పుట్టిన ప్రభువు ఆయన. ఆయననుగురించి మనకు దిగులెందుకమ్మా'.

గర్గాచార్యుడు మాట్లాడుతుండగానే కృష్ణుడు, బలరామ సాత్యకులతో ప్రవేశించి తల్లికీ ఆచార్యునికి నమస్కరించాడు. ఔపచారికాలు అయిపోయిన తరువాత విషయాన్ని చెప్పి 'అమ్మా, దీవించి పంప'మని కృష్ణుడన్నాడు.

దేవకి అతణ్ణి దగ్గరికి తీసుకొని, చెంపలు తడిమింది, శిరస్సును దువ్వింది. వీపును రాస్తూ 'సరే నాయనా' అని దీవించింది.

'అమ్మా! ఒక్కరు కాదు-పదహారు వేల ఒక్క వందమంది. నిస్సహాయు రాండ్రు. అలా నరకుని చెరలో అలమటిస్తూ, జీర్ణిస్తూ ఉంటే నీ కుమారుణ్ణి చూస్తూ ఊరుకోమంటావా? వారి వేడి నిట్టూర్పులు మహాగ్నులై లోకాలను దహించకముందే వారు కార్చిన కన్నీరు ప్రళయసముద్రంలా పొంగి ప్రపంచాన్ని ముంచకముందే, వారిని కాపాడి శాంతి పంచవద్దా?'

'దేవకి కృష్ణుని మాటలకు కరిగి, తల నిమిరి 'వెళ్ళవమ్మా! వెళ్ళు. నీకు జయం లభిస్తుంది' అన్నది.

కృష్ణుడు ఆచార్యుని ఆశీస్సులు కూడా తీసుకొని 'ఆచార్యా, మనం శ్రవణం మొదటిలో ఉన్నాం. నా ప్రయాణానికి పదహేనురోజుల తర్వాత ముహూర్తం నిర్ణయించడానికి కూర్చుందాం' అని సెలవు తీసుకున్నాడు.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**



## 6. సద్గురు, సమర్థ గురుడు సాయి



తే.గీ. 'వెంకుసా' గురు బోధల విజ్ఞుడైన
ప్రాజ్ఞ శిష్యుడు పరమాత్మ పరమ గురుడు
వచ్చి చేరెను పదునారు వత్సరముల
సాయి నాధుడు శిరిడీన, సంస్కరించ ... 1

తే.గీ. కాంతు లీనెడు కనులును, కరుణ పొంగు
హృదయ కమలంబు, మాటలు హృద్యములును
పంచ భూతాల గుప్పిట పట్టియుంచి
సాయి చేరెను శిరిడీన సాధువటుల ... 2

తే.గీ. గురుడు, సద్గురు, సమర్థ గురుడు సాయి!
తల్లి దండ్రియు గురుడును తానె యగుచు
తీర్చి దిద్దెను 'వెంకుసా' తీరు గాను ....
లోక జనులను కావంగ లోక హితుడు ... 3





తే.గీ. చేయు పనులందు ప్రశాంత చిత్త మలర
శాంతి ధాంతియు దమములు శక్తులవగ
నింబ వృక్షము నీడన నిలచె సాయి
బాల సాధువు పదునారు వత్సరముల ... 4

తే.గీ. శివుని ప్రతిరూప మీ సాయి! ఋష్య శృంగు
వోలె తత్త్వము బోధించి ఊరి జనుల
యార్తి దీర్చుచు వారల నాదరించి
పరము జేర్చగ నిరతము పాటు బడెను ... 5

తే.గీ. పరుల సేవయె పరమాత్మ ప్రార్థననుచు
జాతి మతముల మాన్యత జాడ్యమనుచు
ఆత్మ లన్నియు పరమాత్మ యనుచు గఱపి
తెలియజెప్పెను వారికి తేట మనగ ... 6

తే.గీ. మతపు మారన కొట్లాట మానిపించి
హిందు ముస్లిము వర్గాల హింస మాన్పి
రామ నవమియు రంజాను రమ్యమవగ
అన్ని మతములు పొల్గొను నటుల జేసె ... 7

తే.గీ. ఆడు వారెల్ల అక్కచెల్లెండ్రు గాగ
అన్ని కుల మతముల వారు అన్నదమ్ము
లనుచు పరిపక్వ భావ మలరగ జేసె
సాయినాధుడు తనదైన సాధువృత్తి ... 8

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఒక సత్కార్యమునకు విచ్ఛేసిన భక్తులకు కష్ట నష్టములు సంభవించి నని ఈ సంఘటన మనకు తెలియజేయుచున్నది.

కర్నాటక రాష్ట్రమునకు చెందిన హెూసూర్ పట్టణ వాసియైన డా॥ కె.ఆర్. విజయ్‌కుమార్‌గారు హైదరాబాద్ వాసియైన సాయిభక్తులు డి.శంక రయ్యగారి ద్వారా స్వామీజీని గురించి తెలుసుకొని 1982లో స్వామీజీని దర్శించెను. 1984వ సంవత్సరములో షిరిడి సాయి సంస్థాన్‌వారు ప్రచు రించు సాయిలీల మాసపత్రిక రచయితల వార్షిక సమావేశమునకు షిరిడీ వెళ్ళెను. తన కార్యక్రమములన్నియు ముగించుకొని తిరుగు ప్రయాణమునకు సన్నద్ధమగు సమయమున ఆయన తిరుగు ప్రయాణ టిక్కెట్టు, డబ్బులు గల పర్సు దొంగిలించబడినది. ఈ సంగతి సంస్థాన్ వారికి తెలియజేయగా వారు మైక్‌లో అనేక పర్యాయములు ప్రకటించి నను ఫలితము శూన్యమాయెను. స్వామీజీకి జరిగిన సంగతి వివరించగా స్వామి చింతించకుము. అలనాడు సముద్రమును దాటిన పవన పుత్రుని గుర్తు తెచ్చుకో రాముని శక్తియే హనుమంతుని సంద్రము దాటించెను. నీ వెనుక నున్న సాయి శక్తి నిన్ను క్షేమముగా బెంగుళూరు చేర్చును. సాయిని విశ్వసించు. నీకే కష్టము కలుగదు" అని అభయమిచ్చెను. రైలులో టి.సి.కి జరిగినదంతా వివరించగా టి.సి. అన్ని వివరములు చూసి బెంగు ఊరు వరకు వేరే టికెట్టు కొనకుండా ప్రయాణించుటకు అనుమతించెను.

స్వామీజీ ప్రతి నిత్యము ఎందరికో ఎన్నో విధముల సహాయము చేసెడి వారు. అటువంటి స్వామీజీ విజయకుమార్‌కు ధన సహాయము ఎందుకు చేయలేదన్న సంగతిని మనం గ్రహించాలి. విజయకుమార్‌కు బాబా





యందు ధృఢభక్తి కలుగచేయవలెననియే స్వామీజీ ధనసాయము చేయక అభయమిచ్చి పంపెను.

**స్వామిని కరుణించి దర్శనమొసంగిన సాయి :**

స్వామి నిస్వార్థ సేవకు ప్రసన్నుడైన సాయి స్వామిని కరుణించిన వైనాన్ని మీకిదివరకే అందించాను. అంతటి అకుంఠిత సాయి సేవకునికి సాయి ఏయే రూపాలలో దర్శనమిచ్చినది బాబా కృపతో యిప్పడు మీ కందిస్తాను. స్వామీజీ షిరిడీకి వచ్చిన ప్రథమార్థంలో ఒకనాటి వెన్నెల రేయిలో లెండీబాగ్‌లో పిట్టగోడ వద్ద ధ్యానం చేసుకుంటున్న స్వామికి నంద దీపానికి దత్త మందిరానికి మధ్యన గల స్థలమందు రాతిబండ మీద ఆశీనుడై బాబా దర్శనమిచ్చెను. స్వామీజీ అది తన భ్రాంతియని భావించి కొన్ని క్షణముల తరువాత మరల చూడగా బాబా అదే విధంగా దర్శనమిచ్చెను. స్వామీజీ ఆ దృశ్యానికి సమీపంగా వెళ్ళి పరికించి చూడగా బాబా అంతర్ధానమయ్యెను.

మరొక పర్యాయం స్వామీజీ గురుస్థాన్‌లో ఉండగా ఒక కుష్ఠురోగి వచ్చి బాబా తీర్థం ఇవ్వమని అడగగా స్వామీజీ తమ గదిలో బకెట్టులో గల బాబా అభిషేక తీర్థం ఇవ్వగా అదికాదు బాబా మహాసమాధి చెంత రాత్రులందు పెట్టిన తీర్థం ఇవ్వమని అడిగాడు. తన దగ్గర ఆ తీర్థం గలదని అతనికి ఎలా తెలిసిందాయని ఆలోచిస్తూ గదిలోకి వెళ్ళి తీర్థం తీసుకు వచ్చేసరికి ఆ వ్యక్తి కనుమరుగాయెను. ఆ వ్యక్తి కోసం ఎంత గాలించినా ప్రయోజనం లేకపోయింది. స్వామి వద్ద ఆ తీర్థం ఉంటుందన్న సంగతి ఇతరులకు తెలియదు. ఆ తీర్థమే కావాలని అడిగిన వ్యక్తి బాబాయేనని స్వామీజీ గ్రహించారు.

స్వామీజీ చావడిలో భరద్వాజగారు రచించిన "సాయి లీలామృతం" పారాయణ చేస్తుండగా చక్కటి దుస్తులు ధరించి పాదరక్షలతోనే చావడి లోకి ప్రవేశించి "ఏమి చదువుతున్నావు? భరద్వాజ రచించిన లీలా

మృతమా? బాగుంది, చదువు” అని ఆశీర్వదించినది బాబాయేనని సాయి భక్తులందరికీ విదితమే.

వేరొక పర్యాయము స్వామీజీ విరేచనములచే బాధపడుచుండగా ఒక ఆజానుబాహుడు స్వామీజీ గదిలోకి వచ్చి నిమ్మకాయను దిగతుడిచి స్వామీజీ ప్రేగుని తన చేతితో నొక్కి **“నీ విరేచనములు పోయినవి, నీవు నీ నిత్యకృత్యములను నిర్విఘ్నంగా చేసుకో. ఈ నిమ్మకాయను ధునికి సమర్పించు”** అని చెప్పి అంతర్ధానమయ్యాడు. స్వామీజీ తాను విరేచనములతో బాధపడు చున్నట్లు ఎవ్వరికి చెప్పలేదు. సర్వాంతర్యామియైన సాయినాథునికి తన భక్తుని కష్టం ఒకరు చెప్పవలెనా? స్వామీజీకి ఏ విపత్తు సంభవించినను సాయినాథుడు ఏదో ఒక రూపంలో వచ్చి స్వామీజీ కష్టాన్ని కడతేర్చి **“నీ చెంతనే నున్నాను”** అని నిరూపించేవారు.


**స్వామీజీ దిన చర్య :**

షిరిడీ ప్రవేశానంతరము స్వామీజీ దినచర్యను సందర్భానుసారంగా ఇంతకుముందే వివరించుట జరిగినది. స్వామీజీకి వయస్సు మీరిన తరువాత ఆయనకు పూర్తి విశ్రాంతి కల్పించాలని తలంచిన సంస్థాన్ వారు స్వామిని శారీరక సేవ నుండి దూరముగా ఉంచారు. ఈ చర్యకు స్వామీజీ ఏ మాత్రము చింతించక మానసిక సేవ చేసి తరించారు.

ప్రతి నిత్యం స్వామీజీ ఉదయం 3 గంటలకే నిదురమేల్కాంచి సుమారు ఒక గంటసేపు ధ్యానము గావించెడివారు. నాలుగు గంటల సమయంలో వేడినీటిని తెచ్చుకొని స్నానమాచరించి ద్వారకామాయి, గురుస్థాన్, చావడి దర్శనముతో దినచర్యను ప్రారంభించెడివారు. అటు పిమ్మట లెండీబాగ్‌లోని నంద దీపమునకు, దత్త మందిరమునకు, గురు స్థాములకు ప్రదక్షిణలు గావించెడివారు. ప్రదక్షిణలను లెక్కించెడి వారు కాదు. చేయించుకొనెడి వాడు బాబా. ఆయనకు ఎన్ని కావాలో అన్ని చేయించుకుంటాడు అనేవారు. **(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిశోర్

**(గత సంచిక తరువాయి)**

ఆ రోజులలో లోణి పర్వతశ్రేణులలో కాణ్హాభిల్ అనే గజదొంగ ఉండేవాడు. తన పేరు చెబితే ఇటు పోలీసులు, అటు ప్రజలు భయంతో కంపించిపోయే వారు. ఎన్నో దోపిడీలు, హత్యలు చేస్తూ పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసాడు. అంతేకాదు, తనను పట్టుకోబోయిన మరియు తనపై గూఢచర్యం చేయడానికి వచ్చిన ఎంతోమంది పోలీసులను తాను నిర్దాక్షిణ్యంగా పొట్టన పెట్టుకున్నాడు. అటువంటి కాణ్హాభిల్లుపై రామదాసి రూపంలో వెళ్ళి గూఢచర్యం చేసే బాధ్యతను ప్రభుత్వం దాసగణు భుజ స్కంధాలపై ఉంచింది. ప్రాణసంకటమైన ఆ బాధ్యత నుండి తప్పించుకోవ డానికి దాసగణు శతవిధాల విఫల ప్రయత్నం చేసి, చివరకు చేసేది లేక రామదాసి రూపంలో లోణి గ్రామానికి చేరుకున్నాడు. సహజంగా రామదాసి వద్ద ఉండవలసిన దాసబోధ, భావార్థ రామాయణం, జ్ఞానేశ్వరి, విష్ణు సహస్రనామం ఇత్యాది ఉచ్ఛశ్రేణి ఆధ్యాత్మిక గ్రంథాలు దాసగణుకి ప్రభుత్వ ఖర్చుతో లభించాయి. లోణి గ్రామ శివార్లలోని సెలయేటి ఒడ్డున ఉన్న పాడుబడిన రామ మందిరంలో దాసగణు బసచేసాడు. దాసగణు అడుగుబెట్టేటప్పటికి జనాల నిర్లక్ష్యానికి గురైన ఆ దేవాలయంలో దీపం పెట్టే దిక్కు లేక, చెత్తాచెదారం పేరుకుపోయి అడుగుబెట్టలేనంత అపరి శుభ్రంగా ఉంది. ఆ పరిస్థితి చూసి దాసగణుకి తీవ్ర దుఃఖం కలిగింది. వెంటనే దేవాలయాన్ని శుభ్రం చేసి, సెలయేటిలోని మంచినీటితో విగ్రహాలకు అభిషేకం చేసి, దీప ధూపాలను సమర్పించి దేవాలయానికి ఒక పవిత్రరూపు తీసుకువచ్చాడు. తాను రామదాసి అనే నమ్మకం అక్కడి

ప్రజలలో కల్పించడానికి ఒక రామదాసి లాగానే అక్కడ జీవనం కొనసాగించాడు. విధి నిర్వహణలో భాగంగా మొదట ఆ కార్యక్రమాన్ని మొదలు పెట్టినా, తరువాత తరువాత దాసగణు అందులో భక్తిభావంతో లీనమై పోయాడు. ఒక విధంగా తనను తాను మరచిపోయాడు. ప్రతిరోజు ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొని, సెలయేటిలో స్నానం చేసి దేవాలయాన్ని శుభ్రపరిచేవాడు. తరువాత రామునికి అభిషేకం చేసి, చుట్టుప్రక్కల నుండి పూలను సేకరించి మాలగా అల్లి రామునికి అలంకరించేవాడు. తరువాత స్వయంగా నైవేద్యాన్ని తయారుచేసి అర్పించేవాడు. ఉదయం విష్ణు సహస్ర నామాన్ని పన్నెండుసార్లు పఠించడం, సాయంత్రం దాసబోధ, జ్ఞానేశ్వరి వంటి గ్రంథాలను పారాయణం చేయడం, భజన చేయడం వంటి ఇత్యాది పారమార్థిక సాధనలు తన హృదయంపై గొప్ప పరిమాణాన్ని కలిగించడం మొదలుబెట్టాయి. భావపూర్వక భక్తి హృదయమంతా ఆవరించసాగింది. ఏదో తెలియని ఆనందం అనుభవమవసాగింది. కానీ, పై అధికారుల నుండి వస్తున్న సూచనలు తనను కర్తవ్యోన్ముఖుడిని గావించాయి. గ్రామంలో పశుకాపరులైన పిల్లల వద్ద నుండి కాణ్హాభిల్లు తరచూ గ్రామ పటేలయిన గంగారాం పాటిల్ వద్దకు వస్తాడనే సమాచారాన్ని సేకరించాడు. ఆ పిల్లల వద్ద నుండే గంగారాం పాటిల్‌కు సంబంధించిన వివరాలన్నింటినీ దాసగణు తెలుసుకున్నాడు.

దేవాలయానికి కొత్త రూపురేఖలు రావడంతో దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరగసాగింది. అంతేకాదు, రోజు సాయంత్రం దాసగణు చేసే దాసబోధ, జ్ఞానేశ్వరి పారాయణను వినడానికి పెద్ద సంఖ్యలో భక్తులు రాసాగారు. ఆ విధంగా ఒక గొప్ప రామదాసి రామాలయంలో బస చేసియున్నారనే వార్త లోణి చుట్టుప్రక్కల వ్యాపించింది. అలా దాసగణు గురించి విని, తనను కలిసి జాతకం చెప్పించుకోవాలనే ఉద్దేశంతో గంగారాం పాటిల్ దాసగణు వద్దకు వచ్చి, జాతకం చెప్పమని





అభ్యర్థించాడు. తన గురించి ఇదివరకే వివరాలు సేకరించియున్న దాసగణు తన చేతి రేఖలు చూసి చెబుతున్నట్లుగా అభినయిస్తూ, తన వివరాలను పొల్లుపోకుండా చెప్పాడు. తన చేతి రేఖలను చూసే ఇదంతా చెపుతున్నాడని విశ్వసించిన గంగారాం పాటిల్ దాసగణు జ్యోతిష్య పాండిత్యానికి అబ్బురపడ్డాడు. ఈ రామదాసి సామాన్యుడు కాడని, గొప్ప దైవిక శక్తి కలవాడని నమ్మి, దాసగణు పట్ల పూజ్యభావంతో మెలగసాగాడు.

ఇదిలా ఉంటే, రామాలయంలో ఒక రామదాసి బస చేసియున్నాడనే సమాచారాన్ని అప్పటికే సేకరించియున్న కాణ్హాభిల్, ఒకరోజు గంగారాం పాటిల్ ఇంటికి వచ్చి “ఆ రామదాసి ఎవరు పాటిల్?” అని అడిగాడు. కాణ్హాభిల్ సందేహాన్ని అర్థం చేసుకున్న పాటిల్ “తాను దైవికశక్తి కలిగియున్న రామదాసి అని, ఏమాత్రం సందేహించాల్సిన అవసరం లేదని” చెప్పాడు. “లేదు పాటిల్, నేను తన గురించి మొత్తం వివరాలను సేకరించాను. తన వద్దకు పోదాం పద” అని చెప్పి, గంగారాం పాటిల్‌తో కలిసి కాణ్హాభిల్ దాసగణు వద్దకు వచ్చాడు. రావడంతోనే నిద్రపోతున్న దాసగణుని లేపి, కణతలకు తపాకి గురిపెట్టి “ఎవరు నువ్వు? నిజం చెప్పు. నీ పేరు గణపతి దత్తాత్రేయ సహస్రబుద్ధే. నంబర్ 727. అవునా, కాదా?” అని గద్దిస్తూ “నిన్ను ఇప్పుడు చంపకుండా వదలను” అని హూంకరించాడు. దాసగణుకి పై ప్రాణాలు పైనే పోయాయి. సాక్షాత్తూ మృత్యుదేవతే కళ్ళ ముందు కరాళ నృత్యం చేస్తున్నట్లు క(అ)అనిపించింది. మనసులో బాబాను గట్టిగా ప్రార్థిస్తూ, కొంచెం ధైర్యం కూడగట్టుకొని “లేదు, లేదు. నేను సతారా ప్రాంతంలోని పాండవ వాడికి చెందినవాడిని. తీర్థయాత్రలకు వెళ్ళి వస్తుంటే మా ఊరిలో ప్లేగు వ్యాపించింది అని తెలిసింది. అందువలన కొన్ని రోజులు ఆగి వెళదామని ఇక్కడ ఉంటున్నాను” అని సమాధానమిచ్చాడు. “నువ్వు అబద్ధమాడుతున్నావు. నిన్ను చంపేస్తాను” అని కాణ్హాభిల్లు తుపాకీని దాసగణు తలకు గట్టిగా అదిమాడు.


**(సశేషం)**



సాయిధామంలో

# గురుదేవుల జన్మదినం





ప్రియ మిత్రులారా!

మరో ఫాల్గుణ బహుళ విదియ మార్చి 20వ తేదీన వస్తున్నది. మన గురుదేవులు భౌతికంగా లేరిప్పుడు. వారి జన్మదినం వస్తోంది. శ్రీరాముడు లేని శ్రీరామనవమి, కన్నయ్య లేని కృష్ణాష్టమి, దత్తుడు లేని దత్త జయంతి ఎలా జరుపుకుంటామో- అలాగే మన గురుదేవుల చిచ్ఛక్తిని స్మరిస్తూ వారి జన్మదినం ఆరోజు జరుపుకొందాం. వారి ప్రేమ, కరుణ, బోధ, ప్రసన్నతలు కలబోసిన జీవితాన్ని అందరం కలిసి స్మరించుకుందాం. జ్ఞానధామంలో గురు దేవులు శయనించిన చోట తలవాల్చి నమస్కరించుకుందాం. బాధ కలిగితే ఒకరినొకరు ఓదార్చుకుందాం. అందరం ప్రేమమయులైన ఆ స్వామి పాతికేళ్ళు నడయాడిన సాయిధామానికి వచ్చి ఆయన చెంత కొన్ని గంటలు గడిపి, వారి స్మృతులు కలబోసుకొని ధన్యుల మవుదాం. కార్యక్రమం ఇలా రూపొందించుకుంటున్నాం.

**మార్చి 20, 2022** ఉ. గం.8.00 శ్రీ సాయి పూజ

గం. 8.30-9.30 విష్ణు సహస్ర నామం, సాయిచాలీసా పారాయణ, భజన

గం. 10.00 శ్రీ గురుదేవులకు పాదుకా పూజ, గురుసంస్తుతి

గం. 10.30 భక్తుల భావ పరంపర

గం. 11.00 జ్ఞానధామంలో దీపాలంకరణ

గం. 11.30 ప్రవచనం, గురు నమస్కృతి

గం. 12.00 మహా హారతి

మ. గం. 1-00 అన్నప్రసాద వితరణ

అందరూ తరలి రండి - జ్ఞానధామాన్ని దర్శించి,
గురుదేవుల సంస్మరణతో పునీతులు కండి.

**ప్రేమతో ఆహ్వానిస్తూ,**
**గురుచరణ స్మరణతో,**
**సాయిధామం**





## లేఖావాణి

## విచిత్ర అనుభవము

నా పేరు డా॥ యెదుగని లింగం, మేడ్చల్ పట్టణ వ్యాస్తవ్యులము. నాకూ, మన ఆశ్రమానికి చాలా సంవత్సరముల నుండి దైవీ అనుబంధము వున్నది. ఎంతలా అంటే శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజు గారితో గంటల తరబడి ఏకాంతంగా ధర్మ చర్చాగోష్ఠి (ప్రశ్నలు/ఉత్తరాలు/సమాధానాలు) జరిపే వాళ్లం. మా ఊరిలో వున్న శ్రీ గడి మైసమ్మతల్లి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లక్ష పూల రోజున స్వామి దివ్యప్రసంగం చాలాసార్లు విన్నాము. ఈ పరంపరను కొనసాగిస్తూ శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానందప్రభుజీగారు కూడా 13.12.2021 (సోమవారం) విగ్రహప్రతిష్ఠ మహోత్సవమునకు విచ్చేసి తమ అనుగ్రహభాషణం ఇచ్చారు. మన ఆశ్రమములో జరిగిన శ్రీ దత్త శతకుండాత్మక మహాయాగములో నాకు ఒక వింత అనుభవం కలిగినది. యాగశాలలో ప్రవేశించగానే ఏదో ఒక వింత దైవీలోకంలోకి ప్రవేశించామా అనే అనుభూతి కలిగింది. శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ పాదస్పర్శ తర్వాత ఫోటో తియ్యడానికి ప్రయత్నిం చాను. కానీ విచిత్రం! పరిసరాలు అన్ని ఫోటోలో వస్తున్నాయి. కానీ స్వామి మాత్రము ఖాళీ(ఎమ్టీ) (బ్లర్)గా వస్తున్నది. ఇలా నాలుగుసార్లు జరిగినది. అప్పటి శ్రీ షిరిడీసాయినాధుని కథ గుర్తుకు వచ్చింది. ఒక విదేశీయుడు ఫోటో తీయగా రాకపోవడం గుర్తుకువచ్చింది. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ యంత్రాల(మెషిన్)కు నిక్షిప్తంకానీ బ్రహ్మస్థితిలో వున్నారని అనిపించింది. ఇది సత్యం-నా కళ్ళ నుండి కన్నీటిధారలు కారాయి.

చివరగా కులానికి అతీతంగా, ప్రేమనిలయంగా భాసిల్లుతున్న మన ఆశ్రమం శ్రీ రమణాశ్రమంలాగా ఏ హంగూ, ఆర్భాటాలు లేకుండా అందరికీ మనశ్శాంతి ప్రసరిస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. శ్రీ స్వామి సమాధి(జ్ఞానమందిరంలో) కొద్దిసేపు ధ్యానం చేస్తే మన అందరి సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నాయి. ఇది నా స్వీయ అనుభవం గురువుగారి ఆశీస్సులు అందరిపై ప్రసరించాలని మనసారా కోరుకుంటూ-

శలవు, చిత్తగించవలెను,

- మీ యెదుగని లింగం, CEO, Maroen Biochem Pvt.Ltd, Hyd.

# చేటును తెచ్చే చెప్పుడు మాటలు

- శ్రీమతి డా॥ ముక్తేని భారతి, హైదరాబాద్

పురిక అనే ఊళ్ళో పౌరికుడు అనే రాజుండేవాడు. ఆ రాజు చాలా దుర్మా ర్గుడు. ప్రజలను నానాహింసలు పెట్టేవాడు.

కొంతకాలమయ్యాక దుష్టుడైన ఆ రాజు మరణించాడు. మరణించిన ఆ రాజు కాస్తా ఒక నక్కగా జన్మించాడు. కానీ, ఆ నక్కకి పూర్వజన్మ జ్ఞానం ఉండిపోయింది. పూర్వజన్మలో తనెంత దుష్టుడో తెలుసుకొని విచా రించింది. ఈ జన్మలో ఎవరినీ బాధించకుండా ఉండాలని నిశ్చయించు కొంది. గొప్ప వ్రతాన్ని పాటించడం మొదలుపెట్టింది. మాంసం తినడం మానేసింది. అడవిలో ఉండే చెట్టు నుండి కిందపడ్డ ఫలాలు తినసాగింది.

'మాంసం తినని నక్క కూడా ఒక నక్కేనా! దీనిచేత ఎలాగైనా మాంసం తినిపించాల'ని తక్కిన నక్కలన్నీ చేరి మాంసం తినమని ఎంతో బలవంతం చేశాయి. కానీ, సాధువైన నక్క మాత్రం ఆ మాటలు వినకుండా నిగ్రహంతో ధర్మబద్ధంగా జీవిస్తోంది.

తోటి నక్కలకు ఈ పద్ధతి నచ్చలేదు. తమ మధ్యలో ఒక్కరు మంచి వాడున్నా చెడ్డవాళ్ళకు ఇష్టం ఉండదు కదా!

ఓ రోజు పులి నక్క దగ్గరకొచ్చింది. "ఓ స్నేహితుడా! నీ మాట అంగీక రిస్తున్నాను. మంచిమార్గం వైపు నడిపించే గురువు కోసమే చూస్తున్నాను. నీ వద్ద నేను శిష్యునిగా ఉం టాను. నీ ఉపదేశాన్ని శిరసా వహిస్తాను. నీవు నాతోనే ఉండు" అంది ఎంతో ప్రేమగా.

అప్పటినుండి నక్క, పులి మంచి స్నేహితులయ్యాయి. నక్క బోధించే హితవచనాలు పులి మనస్సుకి బాగా నచ్చాయి. పులి తినే మాంసాన్ని రక్షించే బాధ్యత నక్కదే అయినా, నక్కకు మాంసం తినే కోరిక కలగడం లేదు.





అక్కడి ముఖ్యసేవకులైన జంతువులన్నిటికీ నక్కపై అసూయ పెరిగి పోయింది. ఎలాగైనా నక్కని అవమానపరిచాలనుకున్నాయి. ఒక ఉపాయం ఆలోచించి పులి తినే మాంసాన్ని నక్క దాచే స్థలం నుంచి కాజేశారు సేవకులు.

పులికి మాంసం పెట్టాలని ఆ ప్రదేశమంతా వెదికినా నక్కకి దొరకలేదు. రోజూ దాచే చోటే కదా! మాంసం ఏమైందని నక్క మళ్ళీ మళ్ళీ అంతా వెతికి, ఈ మాంసాన్ని ఎవరు ఎత్తుకెళ్ళారో? దొంగలెవరో? ఎలా తెలుసు కోవాలో అని చాలా విచారించింది.

చివరికి నక్క పులి దగ్గరకు వచ్చింది. బాధగా 'రాజా! మీ కోసం దాచిన మాంసం ఎవరో ఎత్తుకుపోయారు' అంది ఎంతో దుఃఖంతో.

పులి వెంటనే సేవకుల్ని పిలిపించింది. ఆ దొంగని వెదికి పట్టండని ఆజ్ఞాపించింది.

ఆ అసూయాపరులైన సేవకులు నక్కను అవమానించాలనుకుంటు న్నారు. కనుక, వెంటనే మాంసం తెచ్చి రాజుకి చూపించారు.

పులి ఆశ్చర్యపోయింది. పులి కళ్ళు కోపంతో ఎర్రగా మెరిశాయి. 'తను నమ్మిన నక్క తననే మోసం చేస్తోందా? ఈ నక్క గొప్ప నీతిమంతుడని అనుకోవడం తనదే తప్పు' అని మనస్సులో అనుకోవడం మొదలుపెట్టింది.

ఇదే సమయమనుకొని సేవకులు, రాజైన పులి చుట్టూ చేరారు.

'రాజా! నక్కేమిటి, వ్రతమేమిటి, మాంసం తినకపోవడమేమిటి? ఇవాళ మీ మాంసం దొంగిలించింది. రేపు ఎవర్ని చంపితింటుందో? మీరు మంచివారు కనుక నక్క మాటలు నమ్మారు. మా మాట విని త్వరగా దీన్ని వదిలించుకోండి. దుష్టుణ్ణి దగ్గరకు రానీయకూడదు' అని సేవకులు అంటుంటే పులి క్రోధంతో గాండ్రించింది.

సేవకులను చూస్తూ-'మీరే నా హితులు. వెళ్లండి. వెంటనే ఆ నక్కని పట్టుకొని వధించండి' అంది.

సేవకులు ఎంతో ఆనందంతో 'నక్కకు మంచి శాస్తే అయింది' అని మనస్సులో మురిసిపోయారు.

ఆ పులి అరుపులు అడవి అంతా ప్రతిధ్వనించాయి. పులి తల్లికి ఈ విషయమంతా తెలిసింది. కొడుకు అసూయపరుల మాటలు విని నక్కకి హానిచేస్తున్నాడని అర్థమైంది.

కొడుకులు చెడుమార్గంలోకి వెళుతుంటే తల్లి వారిని మళ్ళీ సన్మార్గం లోకి తీసుకురావాలి కదా! అది మాతృధర్మం!

తల్లి పులి వేగంగా అక్కడకొచ్చింది. కొడుకుని దగ్గరకు తీసుకుంది- 'నాయనా! చెప్పడు మాటలు వినకూడద. నక్క మంచిది. నీకు హితం చెప్పింది. అసూయపరులు అబద్ధపు మాటలు పుట్టిస్తారు. రాజుగా ఆ విషయం నువ్వు తెలుసుకోకపోతే ఎలా నాయనా! తొందరపడకు' అంది కొడుకుతో తల్లి పులి.

పులిరాజు తల్లి మాటలు వింటున్నాడు. తల్లి పులి వీపు నిమిరింది. తల్లి ఇంకా ఇలా ధర్మబోధ చేసింది.

'నాయనా! బుద్ధిమంతులను చూసి దుర్బుద్ధులైన వాళ్ళూ, అధికులను చూసి హీనులైన వాళ్ళూ, అందమైన వాళ్ళను చూసి అనాకారులూ ఇలాగే అసూయచెందుతారు. ఇది నువ్వు 'గ్రహించాలి' అంది.

తల్లి మాటలు పులిరాజు మనస్సుకి నచ్చాయి. సేవకులే నక్కపై అసూయతో ఈ అబద్ధాలు కల్పించారని అర్థమైంది.

తల్లి, కొడుకు ముఖంలోకి చూసింది. కొడుకు పశ్చాత్తాపడవుతున్నట్లు కనిపించింది. 'నాయనా! నా మాట విను. కొన్ని సందర్భాలలో ధర్మం, అధర్మంలాగా, అధర్మం ధర్మంలాగా కనిపిస్తాయి. కానీ, నిజంగా ధర్మాన్ని కోరేవారు నిర్మలమైన మనస్సుతో ఆలోచించాలి. అప్పడు ధర్మం స్పష్టంగా కనిపిస్తుంది. నువ్వే చెప్ప. ఈ నక్క వచ్చినప్పటినుండీ మనకెంత మేలు కలిగిందీ! ఈ నక్క మనకి ఎన్నో హితోపదేశాలు చేయలేదూ! మరచి





పోయావా! కాబట్టి, హితుడైన మంత్రి రాజు క్షేమాన్నే కోరతాడు. రాజు ఆ విషయం గమనించాలి. కపటుల మాటలకు లొంగిపోకూడదు' అంది కుమారుణ్ణి హెచ్చరిస్తూ తల్లి.

పులిరాజు మనస్సు తేలికపడింది. వెంటనే సేవకులను పిలిపించి నక్కనివధించవద్దని ఆజ్ఞాపించింది. సేవకులు భయంతో వణికిపోయారు. నక్క రాజు ముందర నిలబడింది. పులిరాజు నక్కను కౌగిలించుకుంది. కన్నుల నుండి కన్నీరు కారుతుండగా - 'నన్ను క్షమించు' అంటూ పులి, నక్కని వేడుకుంది. నక్క ఒక చిరునవ్వు నవ్వింది.

'స్నేహితుడా! సభలో నేను మంచివాడినని గౌరవించిన నువ్వు, ఇప్పడు, ఇలా నా మనస్సుని ఎంత బాధించావో తెలుసా! నన్ను నీ వద్ద పదవిలోకి తీసుకుంటానన్నప్పడే నేను నీకీ విషయం చెప్పలేదా! భృత్యులు ఇలాంటి అసూయాద్వేషాలతో ప్రవర్తిస్తారనీ, వారి మాట పాటించకూడదనీ చెప్పలేదా నేను' అని నక్క పలికింది.

నక్క మాటలకి తలవంచింది పులి.

'ఆనాడు నాకు వాగ్దానం చేసి మరిచిపోయావు ఈనాడు. ఓ రాజా! తెలిసో, తెలియకో, ఒకరిని బాధపెట్టి, అవమానపరిచిన తరువాత స్నేహితునిగా మళ్ళీ ఉండడం మేలైనదా? నీలాంటి ప్రభువు దగ్గరుండడం నాకు హితం కాదు. ధర్మం గ్రహించు' అని నక్క పులిని విడిచి వెళ్ళిపోయింది.

అసూయాపరుల మాటలు విని మంచి స్నేహితుణ్ణి పోగొట్టుకొన్నానని దుఃఖించాడు పులిరాజు. 'చెప్పడు మాటలు వినడంవల్ల మంచివారిని, ధర్మపరులను, నీతిమంతులను దూరం చేసుకోవడం జరిగింది' అని పశ్చాత్తాపంతో కుమిలిపోయింది పులి. అరణ్యంలోకి వెళ్ళి తన వ్రతదీక్ష విడువకుండా మాంసం తినకుండా, ధర్మబద్ధంగా జీవించింది నక్క.

కాబట్టి తీయటి మాటలకు మోసపోకుండా, ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో తెలుసుకోవడం ధర్మం!

# దయాహృదయపు దీపకాంతి!

సేకరణ : డి.ఎన్. సంజీవ

అది 1920వ సంవత్సరం. ఇంగ్లండ్‌లోని ప్రముఖ వైద్యకళాశాల, విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం జరుగుతున్న వేళ... వేదికపై ముఖ్య అతిథిగా అప్పటి బ్రిటన్ ప్రధానమంత్రి. కార్యక్రమ ప్రారంభసూచకంగా ఓ సీనియర్ వైద్యుడు మరియు ఆచార్యుడు వైద్యవృత్తి పవిత్రతను గుర్తుచేస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు.

"యువకుడిగా నా వైద్యవృత్తిని ప్రారంభించిన రోజులవి...ఓ రోజు అర్థ రాత్రి మా ఇంటితలుపుల్ని ఎవరో తడుతున్న శబ్దమైంది. ఉలిక్కిపడి లేచి తలుపులు తీసేసరికి, ఇంటిముందు కన్నీళ్ళతో ఓ వృద్ధురాలు. ఎవరని ప్రశ్నించేలోపే 'అయ్యా! నా కొడుకు చావుబతుకుల్లో ఉన్నాడు. మీ కాళ్ళు పట్టుకుంటాను, వచ్చి వాడి ప్రాణాల్ని కాపాడండి' అని ఏకధాటిగా రోదిస్తూ ఉంది. కన్నకొడుకు గురించి విలవిల్లాడిపోతున్న ఆమె దుస్థితిని చూసి, వెంటనే బయలుదేరాను. బయటచూస్తే కుండపోత వర్షం. ఉరుములూ మెరుపులు. దారంతా కమ్ముకున్న చీకటి. ప్రమాదకరంగా రహదారి. అయినా ఆ వృద్ధురాలి వెంట వెళ్ళాను. అది లండన్‌లోని మారుమూల ప్రాంతం. ఎన్నో ప్రయాసలకు ఓర్చి ఎట్టకేలకు వాళ్ళ ఇంటికి చేరుకున్నాం. అది ఓ చిన్నగది. ఒక్కగానొక్క కొడుకుతో ఆ మాతృమూర్తి అందులో ఉంటోంది.

ఆ బాలుడు తీవ్ర అస్వస్థతతో బాధపడుతూ ఉన్నాడు. అతణ్ణి పరీక్షించి, కొన్ని మందులు ఇచ్చాను. అతను కొద్దిగా కోలుకున్నాక 'ఇక ఎలాంటి ప్రాణాపాయం లేదు. నిశ్చింతగా ఉండండి' అని చెప్పి సెలవు తీసుకో బోయాను. ఇంతలో ఆ తల్లి కన్నీళ్ళతో నా చేతిలో తాను దాచుకున్న ఓ డబ్బుల మూటను ఉంచి, కృతజ్ఞతలు చెప్పింది. కానీ, వాళ్ళ దయనీయ





పరిస్థితిని చూశాక, డబ్బులు తీసుకోబుద్ధి కాలేదు. అందుకే సున్నితంగా ఆమె అభ్యర్థనను తిరస్కరిస్తూ, ఆ మూటను ఆమెకే తిరిగి ఇచ్చేశాను. అంతేకాకుండా 'నీ కొడుకు పూర్తిగా కోలుకునేవరకు వచ్చి పరీక్షిస్తాను' అని మాట ఇచ్చాను. నా వైద్యవృత్తి అనుభవంలోనే అది మరుపురాని సంఘటన. భగవంతుడితో సమానమైన ఆరాధనను పొందే, అత్యంత ఆదరణీయమైన వృత్తి ఇది. ఇలాంటి అదృష్టం అందరికీ లభించదు' అంటూ ప్రసంగాన్ని ముగించారు. వెంటనే వేదికపై ఉన్న బ్రిటన్ ప్రధానమంత్రి లేచి, ఆనందపరవశంతో ఆ ఆచార్యుడి చేతులు పట్టుకొని తన కళ్ళకద్దుకొని ముద్దుపెట్టుకున్నారు.

"సార్! మీరు ప్రాణభిక్ష పెట్టిన ఆ బాలుడిని నేనే సార్. ఇరవై ఏళ్ళుగా మీ కోసం వెతుకుతున్నాను. మీ పేరు కూడా అమ్మ సరిగ్గా గుర్తులేక, నాకు చెప్పలేకపోయింది. మిమ్మల్ని కలుసుకొని కృతజ్ఞతలు చెప్పకోవాలని ఆమె చివరి క్షణాల వరకు ఎన్నో ప్రయత్నాలు చేసిందికానీ మిమ్మల్ని కలవ కుండానే కన్నుమూసింది. ఇప్పుడు నేను మిమ్మల్ని కలుసుకున్నానని తెలిస్తే, అమ్మ ఆత్మ శాంతిస్తుందనుకుంటున్నాను. ఆనాటి మా పేదరికంలో మీరు చూపిన దయ ఎన్నటికీ మరువలేనిది. మీరు పెట్టిన ప్రాణభిక్ష వల్లే, ఆ నిరుపేద బాలుడు నేడు బ్రిటన్ ప్రధానమంత్రి అయ్యాడు" అంటూ మరో మారు ఆ వైద్యుడి చేతుల్ని కళ్ళకు అద్దుకున్నాడు. ఆ ప్రధాని ఎవరో కాదు 'లాయిడ్ జార్జ్'.

ప్రేమ, కరుణల శక్తి అనంతమైనది. గోరంత దీపమైనా, కొండంత వెలుగునిచ్చినట్లు, ఎన్నడో, ఎక్కడో స్పందించిన మన హృదయం తెరలు, తెరలుగా ప్రతిస్పందిస్తుంది. ప్రభావాన్ని చూపుతుంది. ఇతరులకు మనం చేసే మంచి మన హృదయాన్ని పవిత్రీకరిస్తుంది. దయాహృదయపు దీప కాంతి నలుదిశలా వ్యాపిస్తుంది. అంతేకాకుండా మన జన్మకు ఒక సార్థకతను చేకూరుస్తుంది. సంపదల్లో, సుఖాల్లో లేని సంతృప్తి పరుల సేవలో లభిస్తుంది.

# ధీరవాణి

సోదరులారా!

హృదయం వేదనాభరితమైనప్పుడు, విచారమనే తుపాను విజృంభించినప్పుడు, దారి కనిపిస్తుందన్న ఆశే అడుగంటినప్పుడు, ఆశాధైర్యాలు దాదాపు శూన్యమైనప్పుడు... ఆధ్యాత్మిక పెనుతుఫాను లోపలి నుండి బ్రహ్మ ప్రకాశంలా తళుక్కుమని మెరుస్తుంది. సుఖసంపదల్లో పుట్టి పెరిగి, హంస తూలికాతల్పంలో శయనిస్తూ, ఏనాడూ ఒక్క కన్నీటి చుక్కనైనా కార్చి ఎరుగని వాడెవడైనా గొప్పవాడయ్యాడా?

హృదయానికి, బుద్ధికి సంఘర్షణ జరిగినప్పుడు హృదయం చూపే మార్గాన్నే అనుసరించాలి. ఎందుకంటే మేధాశక్తి ఒక హేతువాద స్థాయికే పరిమితమవుతుంది. ఆ స్థాయిని దాటి అది పోలేదు. మేధాశక్తి ఏనాటికీ అందుకోలేని ఉన్నతస్థాయికి హృదయం వెళ్ళగలదు. హృదయం ధీశక్తిని అధిగమించిపోయి, బ్రహ్మజ్ఞాన ప్రేరణాన్ని చేర్చగలదు. హృదయమున్న వారికి లభించేది వెన్న, బుద్ధిశీలురకు మిగిలేది మజ్జిగ మాత్రమే.

మనమంతా నిజాయితీగా ఉందాం. ఆదర్శానుసారం మనం ప్రవర్తించకపోతే మన బలహీనతను అంగీకరిద్దాం. అంతేగానీ, ఆదర్శాన్ని మాత్రం బలికానివ్వకుండా చూద్దాం. ఎవరైనా సరే ఆదర్శాన్ని దిగజార్చనివ్వ కూడదు. విజయవంతమైన ప్రతి వ్యక్తి వెనుక అద్భుతమైన చిత్తశుద్ధి, నిజాయితీ ఉండి తీరాలి. అతడు పూర్తిగా నిస్వార్థుడు కాకపోవచ్చును కానీ, అతడా లక్ష్యంవైపే వెళుతుంటాడు. అతడే పరిపూర్ణ నిస్వార్థుడై ఉంటే, అతడి విజయం బుద్ధుడి, క్రీస్తుల విజయమంతటిదే అయివుంటుంది.

సత్యం, పవిత్రత, నిస్వార్థత-అనేవి ఎవరిలో ప్రవర్తిల్లుతాయో ఆ సద్గుణశీలుణ్ణి సృష్టిలోని ఏ శక్తీ నశింపజేయలేదు. ఈ సద్గుణాలను కలిగిన వ్యక్తి, సమస్త విశ్వమూ తనను ఎదిరించినా ప్రతిఘటించి నిలబడే సమర్థుడు.





పరులకు మంచిని చెయ్యడమే పుణ్యం, పరులకు హానిచెయ్యటమే పాపం. బలమే పుణ్యం, బలహీనతయే పాపం. తన కాళ్ళ మీద తాను నిలబడి స్వతంత్రంగా మనుగడ సాగించడం పుణ్యం, ఇతరుల మీద ఆధారపడి జీవించడం పాపం. ఇతరులను ప్రేమించడం పుణ్యం, ద్వేషించడం పాపం. భగవంతుడిలో, తన ఆత్మలో ఉన్న నమ్మకమే పుణ్యం. సందేహమే పాపం. ఏకత్వాన్ని గురించిన జ్ఞానమే పుణ్యం, భిన్నత్వాన్ని చూడటమే పాపం.

పరమపావనులైన పవిత్రాత్ములు మీరు. ఉత్తిష్ఠత, జాగ్రత్త. ఓ మహాశక్తి సమోపేతా! ఈ నిద్ర మీకు తగదు. లేవండి. మేల్కొండి! దుర్బలురమని, దుఃఖితలమని భావించకండి. పాపిగా చిత్రించుకోవడం అనుచితం, దుర్బలుడిగా భావించటమూ అనుచితమే. ఈ సంగతిని ప్రపంచానికి చాటిచెప్పండి. ఉన్నతమైన ఆదర్శభావాలను, ప్రతి వ్యక్తి ముంగిటకు తీసుకువెళ్ళే వ్యవస్థను ప్రారంభించాలి. ఇదే నా జీవితేచ్ఛ.

**దేవుడు అంత దూరంలో ఉన్నాడా?**

**అతడు ఆకాశం పైనా లేడు - పాతాళం క్రిందా లేడు.**

**ఎప్పుడూ అతడు నీ దగ్గరే ఉన్నాడు!**

**ఆయన్ను వెదకటానికి ఎక్కడికి వెళ్ళనక్కరలేదు.**

**మానవ రూపంలో ఉన్న దైవాన్ని చూడు.**

**- 'సాయీ సూక్తి సుధ' నుంచి.**

# స్వామి వివేకానంద సూక్తులు

1. అపార విశ్వాసం, అనంతశక్తి ఇవే విజయ సాధనకు మార్గాలు.
2. విధేయతను మొదట అలవరచుకోండి. సేవకుడిగా ఉండటం నేర్చుకుంటే, నాయకుడు అయ్యే యోగ్యత లభిస్తుంది.
3. మొదట మీరు పవిత్రులు కండి. ప్రపంచమంతా పవిత్రంగా కనపడి తీరుతుంది.
4. ఇసుమంత ఆచరణ, ఇరవై వేల టన్నుల వ్యర్థమైన మాటలతో సమానం.
5. లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధ, ఆసక్తులను లక్ష్యసాధనలో సైతం చూపించాలి. విజయరహస్యం అంతా ఇదే.
6. పట్టు వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.
7. ప్రతి పని ఈ మూడు దశలను దాటాలి, అవహేళన, వ్యతిరేకత తరువాత ఆమోదం.
8. మనం సుఖంగా ఉండటానికి అత్యంత సులువైన మార్గం ఇతరులు సుఖంగా జీవించేలా చేయడమే!
9. భగవంతునివైపు వెళ్లేలా చేసే ఏ కార్యమైనా సత్కార్యమే, అదే మన ధర్మం.
10. సహనం లేని వ్యక్తి ఎన్నటికి విజయం పొందలేడు.
11. పవిత్రంగా నిస్వార్థంగా ఉండటానికి సదా ప్రయత్నించు. మత సారమంతా ఇదే.
12. విధేయత, సంసిద్ధత, కర్తవ్యం మీద ప్రేమ-ఈ మూడు మీలో ఉంటే, మిమ్మల్ని ఏదీ అడ్డుకోలేదు.
13. నిలువెల్లా స్వార్థం నిండిన వ్యక్తే ఈ లోకంలో ఎక్కువ దుఃఖాన్ని అనుభవించేది. పరమానందాన్ని పొందేది స్వార్థం లేశమైనా లేని వ్యక్తే.
14. మనస్సు ఎంత నిర్మలంగా ఉంటే, దాన్ని నియంత్రించటం అంత సులభం.
15. ఏ కార్యంలోనైనా సరే ఏకాగ్రతా శక్తి ఎంత అధికంగా ఉంటుందో ఆ కార్యం కూడా అంత చక్కగా నిర్వహించబడుతుంది.





# ప్రాతఃస్మరణీయుడు సర్దార్ పటేల్



- బలుసా జగతయ్య, 90004 43379

భారతదేశాన్ని బ్రిటిష్‌వారు పాలిస్తున్న సమయంలో 75 శాతం మంది ప్రజలను, 55 శాతం భూభాగాన్ని బ్రిటిష్‌వారు ప్రత్యక్షంగా పాలించేవారు. 25 శాతం మంది ప్రజలను, 45 శాతం భూభాగాన్ని 565 సంస్థానాలుగా విభజించి, సంస్థానాధిపతుల దగ్గర కప్పం రూపంలో సొమ్ము పొంది వారి కనుసన్నలలో సంస్థానాధీశులు పాలించేవిధంగా బ్రిటిష్‌వారు భారత దేశాన్ని పాలిస్తుండేవారు. 1857లో 'మంగళపాండే' రగిల్చిన స్వాతంత్ర్యో ద్యమం 1947 వరకు మధ్యమధ్యన కొంత అంతరాయం ఏర్పడి నప్పటికీ నిరంతరాయంగా కొనసాగింది.

1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత భారతీయుల స్వాతంత్ర్యోద్యమాన్ని నిలువరింపజేయటం కష్టంగా భావించిన బ్రిటన్‌వారు కొంత మెతకవైఖరి అవలంబించడం ప్రారంభించారు. కాని వారు విడిచి పెట్టిన భారతదేశ స్వరూపాన్ని, సాంస్కృతిక పరిమళాలను సర్వనాశనం చేసి వారి మానసపుత్రులుగా కొనసాగేటట్లు పాలించేవారిని ఇక్కడ అందలమెక్కించే ప్రయత్నం చేశారు.

వారు వెళ్లే సమయంలో భారతదేశాన్ని మతప్రాతిపదికన పాకిస్తాన్, హిందూస్తాన్‌గా విడగొట్టగలిగారు. బ్రిటిష్‌వారి తదనంతరం భారత ప్రధానిగా ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించారు. బ్రిటిష్ వారి పాలనలోని

55 శాతం భూభాగాన్ని 16 ప్రావిన్సులుగా ఉన్న ప్రాంతాలలోని కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఎవరిని ప్రధానిగా సూచిస్తే వారిని ప్రధానమంత్రిగా ఎన్నుకోవాలనే ఆలోచనతో ఎన్నికలు నిర్వహించారు. అంటే 16 ప్రావిన్సుల లోని సభ్యుల తీర్మానాలను కోరారు. 15 ప్రావిన్సులలో చేసిన తీర్మానాలలో ఒక ప్రావిన్సు భోగరాజు పట్టాభిసీతారామయ్యను, 2 ప్రావిన్సులు ఆచార్య కృపలానీని, 12 ప్రావిన్సులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధానమంత్రిగా సూచిస్తూ తీర్మానం చేశాయి. ఈ తీర్మానాలను గాంధీ ముందుంచగా పట్టాభి సీతారామయ్య, కృపలానీ వారి ఓట్లను జవహర్‌లాల్ నెహ్రూకు బదిలీ చేస్తున్నట్లుగా ప్రకటించారు. పటేల్ మౌనం వహించి గాంధీ, నెహ్రూ అభిప్రాయాల కోసం వేచిచూశారు. తమ అభిప్రాయాలను తెలుపకుండా, ముఖకవళికలలో మార్పును గమనించిన పటేల్ తనను ప్రతిపాదించిన తీర్మానాన్ని వదలుకున్నాడు. ఆ వెంటనే గాంధీ నెహ్రూల ముఖాలలో ఆనందం పెల్లుబికింది. అంటే ఆనాడే గాంధీ కనుసన్నలలోనే ప్రజాస్వామ్యం తుంగలో తొక్కబడినది. ఆనాడే సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎంతటి బలమైన ప్రజాదరణ గల నాయకుడో తెలిసిపోయింది. కానీ, గాంధీ ప్రజాభి ప్రాయానికి విలువ ఇవ్వలేదు.

బ్రిటిష్‌వారు కుతంత్రంతో వారి ప్రత్యక్ష పాలనలోని భూభాగానికి మాత్రమే స్వతంత్రాన్ని ప్రకటించినట్లు ప్రకటించగా, మిగతా 565 సంస్థానా లను స్వతంత్ర భారత్‌లో విలీనం చేయుటకు సర్దార్ వల్లభాయ్‌పటేల్ పిలుపునిచ్చినారు. వాటిలో దాదాపు అన్ని సంస్థానాలు భారత్‌లో విలీనం కాగా, జునాఘడ్, ట్రావెన్‌కోర్, జమ్మూ-కాశ్మీర్, హైదరాబాద్ నిజాం సంస్థానాల వారు మాత్రం స్వతంత్రులుగా ప్రకటించుకున్నారు. ఆ సంస్థానా లను స్వతంత్ర భారత్‌లో విలీనం చేయకుంటే స్వతంత్ర భారత్ స్వరూపాన్ని కోల్పోవడమే కాకుండా సాంస్కృతిక ఉనికికే అఘాతం కలుగుతుందని భావించారు పటేల్. వెంటనే రంగంలోనికి దిగి సామదాన భేధ దండో పాయాలను ప్రయోగించి వాటిని కూడా స్వతంత్ర భారత్‌లో విలీనం చేశారు ఘనుడు, జాతీయవాది సర్దార్ వల్లభాయ్‌పటేల్. బ్రిటీష్‌వారు





ప్రకటించిన స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉండినట్లయితే భారతదేశం ఖండికలుగా మిగిలిపోయి ఇక్కడి బ్రిటిష్ పాలన అనంతరం కూడా నిరంతర యుద్ధాలతో, హింసాకాండతో అరాచక పాలనతో మ్రగ్గుతుండే వారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టి, ఉక్కు సంకల్పంతో తీసుకున్న చర్య వలన ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల తీర్పు మేరకు పరిపాలన కొనసాగించడం జరుగుతోంది. ఇట్టి ప్రభుత్వాలలో నిరక్షరాస్యుల నుండి మేధోసంపన్నుల వరకు భాగస్వాములు కాగలుగుతున్నారు. ఈనాటి భారతదేశ స్వరూపానికి కర్త, కర్మ, క్రియ సర్దార్ వల్లభాయ్ పటేల్ మాత్రమే. కావున భారతదేశ ప్రజలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రాతఃస్మరణీయుడు.

# భావనే భగవంతుడు

- వి.ఎస్.ఆర్.మూర్తి

"తండ్రీ! నీ ఆజ్ఞ ప్రకారం వచ్చేశాను. ఇకపై అంతా నీ ఇష్టం" అన్నవి కేవలం మాటలు కావు. ఆత్మానుభవం పొందిన రమణుల సమర్పణ శరణా గతి, వినయం అభివ్యక్తమైన ప్రమాణం. సర్వ వ్యాపకుడు, సర్వమూలాలము అయిన అరుణాచలేశ్వరుడు ఆ క్షణం వరకు రమణుల భావనలో సగుణ మూర్తి. మరుక్షణమే రమణులకు నిరాకార, నిర్గుణ పరబ్రహ్మమైన కర్త. అంతిమంగా తనదంటూ, తనకంటూ ఏ విధమైన ఇష్టాలు లేవని, తన ఉనికి, అస్తిత్వము, వ్యక్తిత్వము అంతా కర్తదేనన్న మనో సంన్యాసం. నిర్భ యత, స్పష్టత, నిష్ఠ కలబోసుకున్న వినిర్మల, నిశ్చల, అచల అమృత, అద్వైత భావసిద్ధి. భగవాన్ రమణుల భువన సంచారంలో ఇదొక రమణీయమైన మలుపు.

ఆత్మానుభవాలు కలగటం అంత సులభం కాదు. కలగకపోవట మంటూ లేదు. కానీ, ఒక ఆత్మానుభవం 54 సంవత్సరాలు నిలకడ చెంది దేహంగా, మోహాతీతంగా ఉండటం మాత్రం అద్భుతం.

"ఏమీ లేదు. ఊరకుండండి" అని బోధించిన మహర్షి, ఆ బోధకు

ఉదాహరణ పూర్వకంగా ఉండగలగటం ఆధ్యాత్మ చరిత్రలో, ఒక అపురూప సన్నివేశం.

మాటకు మనసుకు అందని ఒక పరిసత్యం సాధకుడికి అనుభవం లోకి రావాలి. సత్యానుభవం కలిగిన మహర్షి వంటి వారు మానవ దేహంలో ఉంటూనే సాధకుడికి సాలోక్య, సామీప్య, సారూప్య, సాన్నిధ్య స్థితులలో అందుబాటులో లేకపోతే, సత్యాన్వేషణ కుంటుపడుతుంది. అందువల్లనే మహాత్ములు, మహర్షుల వంటివారు జీవనగమనమంతా సాధనమయంగానూ, మార్గదర్శకంగానూ ఉంటుంది.

మహర్షి వంటి వారికి భగవంతుడు ఒక శక్తి, ఒక దివ్యభావన. అనుభవసిద్ధంగా ఆంతరంగికమే. సర్వం బ్రహ్మమయమనే, స్థిరభావనే వారి స్థితి. ఏకాంతంలో సమూహాన్నీ, సమూహంలో ఏకాంతాన్ని సృష్టించుకొని తమలో తాము ఉంటారు. బయట జరుగుతున్న ఏ విషయమూ వారి స్థితిని ప్రభావితం చేయలేదు. తమ అంతరంగ శుద్ధిని, అద్వైతసిద్ధిని అందరిపై ప్రసరించగల సర్వశ్రేయోకాములై, తమ కర్తవ్యాన్ని నిశ్శబ్దంగా, నిస్తంద్ర మంద్రంగా, నిరంతరాయంగా కొనసాగి స్తారు. అన్ని పనులను సహజనైపుణ్యంతో నిస్వార్థంగా చేస్తారు. అన్నివేళలా లోవెలుగుతో కూడిఉంటారు. ఆత్మనిష్ఠ వారికి సహజంగా ఉంటుంది.

అపరోక్షానుభూతికి రమణులు ఒక సహజ ఉదాహరణ. మరణం అమంగళం కాదు. సత్యసాక్షాత్కారం పొందలేకపోవటమే అసలు మరణం. సత్యానుభవమెరుగని దేహం దాని సంచారం, నిరుపయోగం. అది అసమగ్రం, అసంపూర్ణం.

ఆత్మ ఒక్కటే నాశమెరుగనిది. నశించేవేవీ ఆత్మస్థాయికి చెందినవి కావు. అవన్నీ కేవలం వస్తువులే.

"మనల్ని మనం వదులుకోవాలి. మనల్ని మనం ఖాళీ చేసుకోవాలి. నిష్కామకర్మ, భక్తి, యోగం మనకు మార్గాలు. ఆత్మ విచారణే సాధన. భగవంతుడంటే చైతన్యమే. మౌనంలోనే తత్వం అనుభవమౌతుంది. మాటలు తగ్గించాలి. స్వానుభవ పరిధిలో ఉంటూనే, అనంతత్వంలోకి





మనల్ని మనం ప్రసరించుకోవాలి".

సరిగ్గా మహర్షి స్థితి ఇదే. అద్వైతసిద్ధికి ఆయన ఒక సగుణరూపం. ఏదో శక్తి, ఎవరో కర్త తననూ, ఈ సర్వసృష్టిని నడిపిస్తున్నవేగానీ ఇందులో తమ ప్రమేయమేదీ లేదన్న నిష్ఠ వారిది. భగవాన్ జీవితమంతా ఈ సూత్రం మీద నడిచిందే.

నమస్కారము, పురస్కారము, తిరస్కారము వారిని అంటవు. వారి మార్గమంతా నివృత్తే! తమ చుట్టూ ఉన్న వారి సుఖదుఃఖాలకు, సంతోష ఆనందాలకు ప్రతిస్పందించని పాషాణపాకం కాదది. అయితే స్పందనలన్నీ క్లుప్తంగా, సరళ సమీరంలా, గంభీరంగా ఉంటాయి. ఉద్వేగమెరుగని ఉత్సాహ కీలలుగా ఉంటాయి. తామనుభవించిన ఆత్మానుభవంలో నుంచి వెలువడే ఆధ్యాత్మ తరంగాలు, ఎవరెవరి అవసరాన్ని బట్టి వారికి తాకి, మూలంవైపు నడకసాగేట్లు చేస్తాయి.

ప్రపంచం కల్పించే ప్రతి అవకాశాన్ని ఆత్మోన్నతి కోసం ఉపయోగించుకోవాలి. తత్వవిచారణలో ఆత్మానుభవం శిఖరస్థాయికి చెందినది.

సత్యసాధన-సత్యశోధన ఆధారంగా సాగే ఆత్మవిచారమే అసలు సాధన. 54 ఏళ్ళ రమణుల ఈ దివ్యస్థితి ప్రపంచానికి ఒక నిశ్శబ్దబోధ.

"నిన్ను నీవు తెలుసుకో! అదే అసలు స్పృహ. అదే ఎరుక" అనే రమణ బోధ, ఒక గంభీర తాత్వికచింతన. ఎన్నో పోగొట్టుకుంటేనేగానీ ఈ చింతన స్థిరపడదు. నేను-నాది అనే అహంకార మమకారాలు వదులుకుంటేనే, మనము-మనది అనే విశాలత ఏర్పడుతుంది. ఆపై ఉన్నదంతా ఒకటే అనే స్థిరభావన కలిగి మిగులుతుంది. ఆత్మానుభవమంటే ఒక నిశ్చలత, నిర్మలత, నిరంతరత. అంతేకాదు-అదొక సత్యభూమిక. అందువల్లనే మహర్షి వంటి మహాపురుషులు తమ అనుభూతిని ప్రపంచానికి అందించటంలో ముందుంటారు. స్వయంగా అందించరు. అందుకోమంటారు. అందుకే భగవాన్, "అనుగ్రహమంటే ఆత్మే" అంటారు. అందిస్తున్నదెవరు? అందు కుంటున్నదెవరు? అంతా ఉండటమే. అంతా జరగటమే. ఎవరి కర్తృత్వమూ ఎందులోనూ లేదు.